క్లుప్తంగా

ఉద్యోగాల ఎంపికకు రాత పరీక్ష రేపు

గూడూరురూరల్: శ్రీకాళహస్తి సమీపంలోని హిందుస్తాన్ కోకాకోలా బేవరేజస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 30వ తేదీన గూడూరు పాలిటెక్నిక్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ కె.రవికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా (మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్) పూర్తి అయిన అభ్యర్థులకు 30వ తేదీ న రాత పరీక్ష, 31వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.3.50 లక్షల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 30వ తేదీన ఉదయం 9.30 గంటలకు జరిగే రాత పరీక్షకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 98498 07725, 91218 78042 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ర్యాగింగ్‌తో జీవితాలు ఛిద్రం

గూడూరురూరల్: ర్యాగింగ్‌కు పాల్పడి విద్యార్థుల జీవితాలు ఛిద్రమవుతాయని గూడూరు ఎస్ఐ పవన్‌కుమార్ సూచించారు. గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ర్యాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా నేరమన్నారు. ఏదైనా విద్యాసంస్థలో క్యాంపస్ లోపలగానీ, బయటగానీ ర్యాగింగ్‌కు పాల్పడినట్లు రుజువైతే చట్టప్రకారం రెండేళ్ల వరకు జైలుశిక్షతోపాటు జరిమానా ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ విశ్వక్సేనరెడ్డి, కళాశాల యాంటి ర్యాగింగ్ సెల్ కన్వీనర్ కృష్ణయ్య, ఏఓ కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాల సందర్శన



అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ సభ్యులు

దొరవారిసత్రం: మండలంలోని మావిళ్లపాడులో ఉన్న ఆదర్శపాఠశాలను రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ సభ్యులు రవి, ఆనంద్ శుక్రవారం సందర్శించి, పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణను తనిఖీ చేశారు. ల్యాబ్ పనితీరు, నిర్వహణ, నిధుల వినియోగం, టైమ్ టేబుల్ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన పలు ప్రాజెక్టులను సభ్యులు సందర్శించి, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వాకాడులో కలశయాత్ర

వాకాడు: మండల కేంద్రంలో మేరా మట్టి–మేరా దేశ్ కలశయాత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముందుగా వందేమాతరం గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అధికారులు ర్యాలీ, పంచ ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ గోపీనాథ్, ఎం మోహన్, సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

వెంకటగిరిరూరల్: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సంగమేశ్వరరావు శుక్రవారం పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ బదిలీపై వెళ్లారు. పొదలకూరులో పనిచేస్తున్న సంగమేశ్వరరావు వెంకటగిరి రెగ్యులర్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

అభ్యంతరాలను తెలపాలి

గూడూరురూరల్: మండలంలో ఈ–క్రాప్ బుకింగ్‌పై అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఏడీఏ గోపీనాయక్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ లోగా సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి, అభ్యంతరాలను తెలిపి, సరిచేసుకోవాలన్నారు. శుక్రవారం మండలంలోని మిట్టాత్మకూరు, కొండాగుంట, పోటుపాళెం ఆర్బీకేల్లో ఈ–పంట ముసాయిదా జాబితాలను ప్రదర్శించి గ్రామసభలు నిర్వహించారు. ఏఓ రమేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ



మండల పూజలో పాల్గొన్న భక్తులు

గూడూరురూరల్: గాంధీనగర్‌లో నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం మండల పూజ ఘనంగా నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిగి 40 రోజులు పూర్తి అయిన సందర్భంగా మండల పూజ చేశారు. అనంతరం అన్నదానం జరిపారు. నాయకులు కే విద్యాసాగర్, మురళి, ప్రభు, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, దాము నాయుడు, ఉదయ్, సురేష్, సురేంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.

భవనాన్ని అప్పగించండి

కోట: మండల కేంద్రంలోని లక్ష్మమ్మ గిరిజన కాలనీలో నిర్మించిన సామాజిక భవనాన్ని గిరిజనులకు అప్పగించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కాలనీకి విచ్చేసి, భవనాన్ని పరిశీలించారు. అనంతరం ర్యాలీగా ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓ భవానీతో మాట్లాడారు. ఏపీ గిరిజన సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు శేఖర్, ఎం వెంకటేశ్వర్లు, ఆర్వీ రమణయ్య, శ్రీనివాసులు, సర్పంచ్ వెంకటరమణమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వగృహ ప్రాప్తిరస్తు..

నిరుపేదల నిరీక్షణ ఫలించనుంది. సొంతింటి కల సాకారం కానుంది. అద్దె, ఇరుకు పాకల్లో ఉన్న వారికి పక్కాఇల్లు సమకూరనుంది. వెంకటగిరిలో నిర్మించిన టిడ్కో ఇళ్లు శనివారం లబ్ధిదారులకు అందజేసి, స్వగృహప్రాప్తి కల్పించనున్నారు.

- సర్వాంగ సుందరంగా టిడ్కో గృహాలు
- నేడు లబ్ధిదారులకు తాళాల అందజేత



టిడ్కో గృహాలు

సైదాపురం/వెంకటగిరి రూరల్: ప్రస్తుత ప్రభుత్వం పేదోడి సొంతింటి కల సాకారం చేస్తోంది. వెంకటగిరి పట్టణంలోని పేదలను ఇంటి యజమానులుగా మార్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా టిడ్కో ఇళ్ల తాళాలను శనివారం లబ్ధిదారులకు అందజేయనున్నారు. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని చెవిరెడ్డిపల్లె సమీపంలో 5 ఎకరాల్లో జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. అంతకుముందు ఆ ప్రాంతంలో 1,008 టిడ్కో గృహాలను నిర్మించారు. ఆ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ క్రమంలో శనివారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతులు మీదుగా 194 మందికి తాళాలను అందజేయనున్నారు.

మౌలిక వసతుల కల్పన

టిడ్కో గృహాలను సుమారు 38 బ్లాక్‌లలో 48 భవనాలను నిర్మించారు. విద్యుత్ సౌకర్యం కోసం సబ్ స్టేషన్ కూడా ఏర్పాటు చేశారు. సువిశాలమైన రహదారులతోపాటు డ్రైనేజీ సౌకర్యం కల్పించారు. తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేశారు.



మురికి నీటిని శుద్ధి చేసే ప్లాంట్

సొంతింటి కల నెరవేరబోతుంది



నాది వెంకటగిరి పట్టణం బంగారుపేట. మేము 30 ఏళ్లగా చిన్న రేకుల షెడ్డులో మగ్గం ఏర్పాటు చేసుకుని, అక్కడే కాపురం ఉంటున్నాం. మాకు టిడ్కో ఇల్లు మంజూరైంది. శనివారం మాకు ఆ ఇంటి తాళాలు ఇవ్వనున్నారు. దీంతో 30 ఏళ్లగా నెరవేరని మా సొంతింటి స్వప్నం నెరబోరబోతుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. **– కలపాటి తులసి**

ఇబ్బందులు తొలగనున్నాయ్



25 ఏళ్లగా సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. ఏమీ చేయలేని వయసులో విధిలేక బంధువులు ఇళ్లల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతాదోనని కొండ ఆశతో ఎదురు చూస్తున్నాను. నేటి ప్రభుత్వ చొరవతో నాకు ఇల్లు మంజూరైంది. నా ఇబ్బందులు తొలగనున్నాయి. **– చల్లా రంగమ్మ, వెంకటగిరి**

మత్స్యసంపదతో సొసైటీలు బలోపేతం



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే, అధికారులు

చిల్లకూరు: మత్స్య సంపదతో సొసైటీలు బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని చిల్లకూరు, రామారెడ్డిపాళెం, కడివేడు గ్రామాల్లోని చెరువుల్లో శుక్రవారం మత్స్యశాఖాధికారుల ఆధ్వర్యంలో సుమారు 9 లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యసంపద అభివృద్ధితో ఎస్సీ, ఎస్టీ, సొసైటీలు సభ్యుల కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీతో చేప పిల్లలను అందిస్తుండగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మిగిలిన 40 శాతం చెల్లించి, ఉచితంగా చేప పిలలను అందించేలా ఏర్పాటు చేశారన్నారు. ఐదు రకాల చేప పిల్లలను ఇస్తున్నారని, వీటిలో బొచ్చె, గండి, గడ్డి చేప, బంగారుతీగ, మోస రకాల చేపలను పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీనివాసనాయక్, ఏడీ రాజేష్, ఎఫ్‌డీఓ రఘుబాబు, అసిస్టెంట్ విజయ, జెడ్పీటీసీ సభ్యుడు ఎం శీనయ్య, వైస్ ఎంపీపీ చెంగయ్య, నాయకులు అనుదీప్, వీ శ్రీనివాసులు, ఎం శ్రీనివాసులు, కమృద్దీన్, బీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్ఠ వేడుకల్లో ఎమ్మెల్యే

వాకాడు: మండలంలోని అందలమాలలో శుక్రవారం జరిగిన అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ వేడుకల్లో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు ఆలయంలో హోమాలు, అభిషేక పూజలు చేశారు. తరువాత అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు ఎస్ భూదేవమ్మ, కే దామోదర్‌రెడ్డి, పీ కోటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

వెంకటగిరిరూరల్: రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని 9వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఎం అరుణ్‌బోస్, అసిస్టెంట్ కమాండెంట్ ఎన్టీవీ రామ్‌కుమార్, ఆనంద్‌కన్నా తెలిపారు. మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో శుక్రవారం పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బెటాలియన్‌లో తిరుపతికి చెందిన ఫిరోజ్ డెంటల్ హాస్పిటల్, రమాదేవి సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల వైద్యుల సహకారంతో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో పలువురు బెటాలియన్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని, రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఓ మనోహర్, ఏఓ చంద్రమౌళి, వైద్యులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం

గూడూరురూరల్ : రక్తదానంతో ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేయవచ్చని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గూడూరు సబ్ డివిజన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో పోలీసు సిబ్బంది, యువతీ యువకులతోపాటు కళాశాల విద్యార్థులు 150 యూనిట్ల రక్తం దానం చేశారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, ప్రసవ సమయాల్లో రక్తం అందక అనేక మంది చనిపోతున్నారన్నారు. యువత రక్తదానంపై అవగాహన పెంచుకుని రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు దశరథరామారావు, హజరత్‌బాబు, వెంకటేశ్వరరావు, ఎస్ఐ అంజిరెడ్డి, కళాశాల ఏఓ రామయ్య, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరిరూరల్: రక్తదానం చేస్తున్న సిబ్బంది

ఈ-క్రాప్ తప్పనిసరి



నెలబల్లిలో పంట జాబితాను రైతులకు చూపుతున్న అధికారులు

దొరవారిసత్రం: రైతులు రాయితీలు పొందాలంటే ఈ–క్రాప్ నమోదు తప్పనిసరని ఏడీఏ అనిత తెలిపారు. వేణుంబాకం, నెలబల్లి, ఏకొల్లు, తనియాలి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం ఈ–క్రాప్ నమోదుపై గ్రామ సభలు నిర్వహించారు. ఏడీఏ అనిత మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటల వివరాల జాబితాను ఆయా ప్రాంతాల్లోని ఆర్బీకేల్లో ప్రచురించామన్నారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే ఈ నెల 29వ తేదీలోపు రైతులు తమ అభ్యంతరాలను తెలపాలని కోరారు. ఏఓ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఎంతో ప్రయోజనం

చిల్లకూరు: ఈ–క్రాప్ నమోదుతో ఎంతో ప్రయోజనం ఉందని ఏఓ భవానీ తెలిపారు. మండలంలోని తిక్కవరం, చింతవరం, తూర్పుకనుపూరు గ్రామాల్లోని ఆర్బీకేల్లో రైతులకు ఈ–క్రాప్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ కాలానికి ఈ పంట నమోదు చేయించుకున్న రైతులు తమ పూర్తి వివరాల జాబితాలో ఉన్నాయా లేవా అన్న విషయాలను పరిశీలించుకోవాలన్నారు. ఈ క్రాఫ్‌లో పేర్లు లేని వారు మూడు రోజులలోగా లిఖిత పూర్వకంగా అందిస్తే వారికి మరోసారి అవకాశం కల్పిస్తామన్నారు. వ్యవసాయ సహాయకులు సీహెచ్ వెంకటకృష్ణయ్య, పావని, మానసవీణ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సైదాపురం: ఎంపీ నిధులు రూ.20 లక్షల వ్యయంతో శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం నుంచి సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు తెలియజేయాలి

నాయుడుపేటటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి వివరాలు ప్రజలకు తెలియజేయాలని, ఇందుకు ప్రతి సచివాలయం వద్ద ఆ జాబితా నోటీస్ బోర్డులో పెట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని భరత్‌నగర్ సచివాలయ ఉద్యోగలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పథకాల లబ్ధి పొందని అర్హులను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి గుర్తించాలన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

రాపూరు: మండలంలోని జోరేపల్లెలో శుక్రవారం అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక హోమాలు, మహాపూర్ణాహుతి, అన్నదానం, కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. రాత్రి ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు.

వైఎస్సార్‌సీపీ నుంచి కలిమిలి సస్పెన్షన్

సైదాపురం(వెంకటగిరి): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలి మండలానికి చెందిన కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పార్టీ ప్రధాన కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యలో కలిమిలి రామ్ ప్రసాద్‌రెడ్డిపై క్రమశిక్షణ కమిటీ సిఫార్సు మేరకు సస్పెండ్ చేసినట్లు అందులో తెలియజేసింది.

సైనికుల్లా పనిచేస్తాం

నాయుడుపేటటౌన్: వైఎస్సార్ సీపీ కోసం అందరం కలసికట్టుగా పనిచేస్తామని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి దశరథరామిరెడ్డి అన్నారు. నాయుడుపేట ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతం, భేదం లేకుండా అర్హులైన ప్రతి పేదవాని ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను తీసుకెళ్లిన ఘనత మన సీఎం జగనన్నకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలేయ్మ ఆలయ చైర్మన్ జీ సిద్దయ్య, నాయకులు కే భానుప్రసాద్, డీ రాజశేఖర్‌రెడ్డి, కే భవాన్, కే ఆశోక్ కుమార్, చంద్ర, ఏ లక్ష్మయ్య, కే జిలానీ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండానే మైనింగ్ ప్రాంతాల పరిశీలన

- సైదాపురం మండలంలో టీడీపీ బృందం హడావుడి

సైదాపురం: మైకా గనులను పరిశీలించే ముందుగా సంబంధిత మైనింగ్ ఉన్నతాధికారుల అనుమతులు తప్పని సరి. అవేవీ లేకుండానే హడావుడిగా అక్రమాలు జరిగాయంటూ ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాకు చెందిన టీడీపీ నేతలు ఓ బృందంగా ఏర్పడి సైదాపురం మండలంలోని మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించారు. శుక్రవారం మండలంలోని తుమ్మలతలుపూరులోని జయలక్ష్మి మైకా మైన్స్‌ను టీడీపీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. గని ఉన్న ప్రాంతాన్ని పరిశీలించే క్రమంలో జిల్లా మైనింగ్ అధికారి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అలాగే ఆయనతో పాటు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. కానీ టీడీపీ నేతలు ఆ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మైనింగ్‌ను పరిశీలించి, అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేయడం విస్మయానికి గురిచేస్తుంది.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

వెంకటగిరిరూరల్: పంటల సాగు చేసే సమయంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించుకోవచ్చని ఏడీఏ నాగార్జున సాగర్ పేర్కొన్నారు. మండలంలోని అమ్మపాళెంలో పొలంబడి క్షేత్రదినోత్సవం ఏర్పాటు చేశారు. ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్‌లో ఆర్ఎన్ఆర్–15048 వరి పంట సాగు విధానం, వ్యవసాయ మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత, సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు రేఖ, శివకుమార్, చెంచుభాస్కర్, సుమ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జున సాగర్

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

డక్కిలి(బాలాయపల్లె): బాలాయపల్లె కోదండరామ స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. బాలాయపల్లెకు చెందిన రమేష్‌నాయుడు, దేవిక చౌదరి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీ కార్తీక్‌రెడ్డి, నాయకులు జి రామమూర్తి, వి వెంకటరమణారెడ్డి, రాంబాబునాయుడు, చెంచు కృష్ణయ్య, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈఓకు చెక్కు అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చెన్నైకు చెందిన హెచ్. శంకర్ సుబ్రమణియన్, కళ్యాణి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును వారు ఈఓ. శ్రీనివాసులురెడ్డికి శుక్రవారం అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు ఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీపీ

డక్కిలి: విద్యకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ జీ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వేంకటేశ్వరపురం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి చదువులు చదివాలన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మనబడి నాడు– నేడు పథకంతో అన్ని పాఠశాలల రూపు రేఖలు మార్చారన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పెంచలయ్య, అంగనవాడీ కార్యకర్త ధనలక్ష్మి పాల్గొన్నారు.

పశు వైద్యసేవలు అందించండి



సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపల్ ఇందిర

రాపూరు: వెటర్నరీ పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు గ్రామాల్లోని పశువులకు వైద్యసేవలు అందించాలని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిర పేర్కొన్నారు. రాపూరు మండలం బొజ్జనపల్లె సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల్లో రెండో సంవత్సరం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు కోర్సు సర్టిఫికెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కళాశాల్లో అభ్యసించిన కోర్సును గ్రామాల్లోని పశువుల రైతులకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు అనిల్‌కుమార్, సుప్రజ, శ్రీహరి, వైశాలి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

చిల్లకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరంలాంటిదని ఎంపీడీఓ నిర్మలాదేవి అన్నారు. మండలంలోని తూర్పుకనుపూరు సచివాలయంలో శుక్రవారం జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యులు రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏ నాగమ్మ, నాయకులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే సురక్ష లక్ష్యం


రాపూరు: పేద, ధనిక తేడాలేకుండా ప్రతి ఒక్కరి ఆరోగ్యం పరిరక్షించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ప్రజాప్రతినిధులు అన్నారు. గిలకపాడులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సచివాలయాల పరిధిలో ఇంటింటా సర్వే చేసి, ప్రజలకు అవసరమైన వ్యాధులకు ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ జగన్న ఆరోగ్యసురక్షను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు అనిల్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, విజయ్, జగదీష్, ఎంపీడీఓ అప్పాజీ, వైద్యులు సూర్యధర్మేంద్ర, అంజలి, రాజకుమారి పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కొండాపురంలో..

వాకాడు: కొండాపురం సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న వైద్యులు రోగులకు పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కీర్తి, శశికుమార్, కంటి వైద్యుడు శశికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నేతలు సుధాకర్‌నాయుడు, రవిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చిల్లకూరు: కిట్ అందజేస్తున్న అధికారులు, వైద్యులు

ఏకొల్లులో..

దొరవారిసత్రం: మండలంలోని ఏకొల్లులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పలువురు రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ రఘురావయ్య, వైద్యాధికారి చైతన్య, డాక్టర్ పళనిరాజ్ పాల్గొన్నారు.